క్లుప్తంగా

పెండింగ్ వేతనాలు ఇప్పించాలని వినతి



ఎమ్మెల్యే కాటసానికి వినతి పత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ క్లాప్ డ్రైవర్ల పెండింగ్ జీతాలు ఇప్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నేతలు విజయ్, సాయిబాబా, మైమూద్ పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. ఒక్కో డ్రైవర్‌కు 6 నుంచి 12 నెలల వరకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అగ్రిమెంట్ ప్రకారం ఒక్కో డ్రైవర్‌కు నెలకు రూ.18,500 జీతంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, వీక్లీఆఫ్, ఉద్యోగ భద్రత కల్పించాల్సి ఉందన్నారు. అయితే రెండేళ్ల నుంచి రెడ్డి ఏజెన్సీ, మున్సిపల్ కమిషనర్ డ్రైవర్లకు సమయానికి జీతాలు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు.

వినూత్న రీతిలో అంగన్‌వాడీల నిరసన

కర్నూలు(సెంట్రల్): సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో కళ్లు, చెవులు, నోరు మూసుకుని నిరసన వ్యక్తం చేశారు. కాగా 14వ రోజు సమ్మెలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నాయకులు నరసింహులు, చంద్రశేఖర్, ఏసురత్నం పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం ఆరో రోజుకు చేరుకుంది. ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం కింద రూ.26 వేలు ఇవ్వాలని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, రంగన్న డిమాండ్ చేశారు.

నేడు దత్త జయంతి

కర్నూలు కల్చరల్: మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని నగరంలోని సాయినాథుని ఆలయాల్లో మంగళవారం దత్త జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. సాయినాథునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పల్లకి సేవ, తదితర పూజలు జరగనున్నాయి. ఇప్పటికే సాయి భక్తులు ఆలయాల్లో సాయినామ అఖండ భజన నిర్వహిస్తున్నారు.

దార్శనికుడు.. వాజ్‌పేయి



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కర్నూలు కల్చరల్: దివంగత మాజీ ప్రధాన మంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి దార్శనికుడని బీజేపీ నాయకులు అన్నారు. సోమవారం వాజ్‌పేయి జయంతిని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీజేపీ పతాకాన్ని ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంగస్వామి, భరత్, ప్రసాద్, శ్రీనాథ్ వర్మ, కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య మందిరం.. హిందూ జాతికి మహోన్నతం



మాట్లాడుతున్న నందిరెడ్డి సాయిరెడ్డి

కర్నూలు కల్చరల్: అయోధ్య రామ మందిరం హిందూ జాతికి మహోన్నతమైందని విశ్వ హిదూ పరిషత్ ప్రాంత అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వెంకటా చలపతి కల్యాణ మండపంలో వీహెచ్‌పీ ధర్మరక్ష దివస్ జరిగింది. ఆయన మాట్లాడుతూ జనవరి 22వ తేదీ అయోధ్య మందిరం ప్రారంభం కానుందన్నారు. హిందువులు ధర్మ రక్షణకు కంకణ బద్ధులు కావాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కేంద్ర కార్యదర్శి గుమ్మల్ల సత్యం, జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, నాయకులు మద్దిలేటి, ప్రాణేష్, మహేష్, ఏవీ ప్రసాద్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు, పండితులు మహానందీశ్వర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. పల్లకీలో కొలువైన స్వామివార్లకు హారతిపూజలు, అలంకార పూజలు, ఉత్సవ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం వైభవంగా జరిగింది. వరుస సెలవులు కలిసి రావడంతో పాటు ఈశ్వరుడికి ఇష్టమైన సోమవారం కావడంతో మహానందిలో భక్తుల సందడి నెలకొంది.



క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలుపుతున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



హోసన్నమందిరంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



బిషప్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న బిషప్ చౌరప్ప

క్రిస్మస్ సంబరాలు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- మార్మోగిన జీసస్ కీర్తనలు
- పాస్టర్ల దైవ సందేశం
- నగరంలోని ప్రధాన కూడళ్లలో ఆకట్టుకున్న క్రిస్మస్ స్టార్లు



హోసన్న మందిరంలో..



కోల్స్ చర్చిలో..

కర్నూలు కల్చరల్: హ్యాపీ క్రిస్మస్.. మేరీ క్రిస్మస్.. అంటూ క్రైస్తవులు సోమవారం క్రిస్మస్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి కుటుంబ సభ్యులతో కలిసి చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విడతల వారీగా ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

క్రీస్తు జన్మ వృత్తాంత గీతాలు

జిల్లాలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస ప్రార్థనలు, మిడ్‌నైట్ మాస్ వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువతీ యువకులు వేసిన నాటకాలు, ఆలపించిన గీతాలు అలరించాయి. క్రీస్తు జననం, ఏసు చెప్పిన బోధనలు, ఆయన పంచిన ప్రేమ, ఆయన చూపిన శాంతి మార్గం తదితర వాటిని నాటికల రూపంలో ప్రదర్శించారు. బిషప్ చర్చిలో రెవరెండ్ చౌరప్ప, సీఎస్ఐ చర్చిలో పాస్టర్ వరప్రసాద్, కోల్స్ చర్చిలో అనిల్‌కుమార్ సామ్యూల్, జీవన్‌రావు, హోసన్న మందిరంలో ఫ్రెడీ పాల్, ఎల్ఈఎఫ్ చర్చిలో పాస్టర్ దత్తు బాబు, రాక్‌ఉడ్ చర్చిలో కిషోర్ బాబు, సీక్యాంప్ ప్రార్థనా మందిరం కరుణా సాగర్, హోరేబు చర్చిలో బ్రదర్ సమ్సోనన్న, స్టాంటన్ చర్చిలో వేదన్‌బాబు, ఎల్ఈఎఫ్ చర్చిలో పాస్టర్ దత్తుబాబు సందేశమిచ్చారు.

జీసస్ మాట ప్రపంచ శాంతికి బాట

ప్రార్థనా మందిరాల్లో దైవ సందేశకులు క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. క్రీస్తు పశువుల పాకవంటి అతి సాధారణ ప్రదేశంలో జన్మించి సామాన్య జనులకు ఆశాజ్యోతి అయ్యాడన్నారన్నారు. ఇతరులను ప్రేమిస్తూ ఆపన్న సమయంలో చేతనైన సహాయ సహకారాలందిస్తూ సమాజంలో మానవత్వాన్ని నింపిన నాడే మనమందరం నిజమైన క్రిస్మస్‌ను జరుపుకున్నట్లు అవుతుందన్నారు. జీసస్ మాట ప్రపంచ శాంతికి మాట అని నవ సమాజ నిర్మాణమే క్రిస్మస్ ధ్యేయమన్నారు. ప్రతి ఒక్కరూ మారు మనసు పొందాలని, నూతన జీవితాన్ని ప్రారంభించాలని ప్రబోధించారు. సమాజంలో పెద్దలను గౌరవిస్తూ పిల్లలను ప్రేమిస్తూ సమసమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. క్రీస్తు జననం నవ సమాజ నిర్మాణం కోసమే అన్నారు. దేవాది దేవుడు దీనాది దీనునిగా జన్మించి నేటి సమాజ సేవకులకు మాతృకగా నిలిచారన్నారు. సాటి మనుషులపై ప్రేమ, నిస్సహాయులపై కరుణ, శత్రువులపై క్షమాగుణం వంటి క్రీస్తు సందేశాలు మనమల్ని సన్మార్గంలో నడిపించాలని, అందరిపై క్రీస్తు ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

జీసస్ ఆశీస్సులు అందరిపై ఉండాలి

కర్నూలులో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీ మోహన్‌రెడ్డి పలు చర్చిల్లో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించి సందేశమిచ్చారు. జీసస్ ఆశీస్సులు అందరిపై మెండుగా ఉండాలన్నారు. ఆయన తెలిపిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. సేవా గుణం అలవర్చుకోవాలన్నారు. ఇతరులపై ప్రేమ, దయ కలిగి ఉండాలని సూచించారు.

ఏసు బోధనలు అనుసరణీయం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న శాంతి కమిటీ సభ్యులు

కర్నూలు(సెంట్రల్): క్రీస్తు బోధనలు అనుసరణీయమని, ఆయన చూపిన శాంతిమార్గం ఆచరణీయమని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా శాంతి కమిటీ సభ్యులు బిషప్ అమ్రోజ్, పాస్టర్ సుధాకర్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక ప్రార్థనలు చేసి కలెక్టర్‌కు ఆశీర్వాదాలు అందించి మిఠాయిలు తినిపించారు. తదనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రేమ, జాలి, దయ గుణాలు కలిగి ఉండాలన్నదే క్రీస్తు బోధన అన్నారు. ఏమతం అయినా విశ్వశాంతిని కోరుతుందన్నారు. శాంతియుత జీవనమే క్రిస్మస్ సందేశమని, సకల జనులు సంయమనంతో కలసి మెలసి ఉండాలన్న క్రీస్తుబోధనలు సర్వ మానవాళికి స్ఫూర్తిదాయకమన్నారు.



బిషప్ చర్చిలో క్రైస్తవుల ప్రార్థనలు



కర్నూలు: సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు



హోసన్న మందిరంలో మేయర్ బీవై రామయ్య



లక్ష్మీనగర్‌లోని చర్చిలో..

కనుల పండువగా ప్రభోత్సవం





పూజలందుకున్న చెన్నకేశవస్వామి, పల్లకిపై ఊరేగుతున్న స్వామివారు

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలో వెలసిన శ్రీదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రభోత్సవాన్ని కనుల పండుగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి ముందుగా స్వామి అమ్మవార్లను పల్లకిలో గ్రామ వీధుల్లో డప్పువాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం ప్రత్యేక అలంకరణతో తయారు చేసిన ప్రభపై స్వామిఅమ్మవార్ల విగ్రహాలను ఉంచి ప్రభోత్సవాన్ని నిర్వహించారు.


నేడు రథోత్సవం

బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ హాజరుకానున్నారు.

హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత



హాజరైన జనం,



మాట్లాడుతున్న కమలానంద భారతి

కర్నూలు కల్చరల్: హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గన్నవరం భువనేశ్వరి పీఠం పీఠాధిపతి శ్రీకమలానంద భారతి స్వామి అన్నారు. సోమవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ ధర్మంపై అవగాహన కార్యక్రమం జరిగింది. హిందువులు అందరూ జాగృతమై సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. సమాజంలో ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో వాటిని ఎదుర్కోడానికి సంసిద్ధులు కావాలన్నారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి, అధ్యాపకులు కల్లే వేణుగోపాల్ శర్మ మాట్లాడారు. సమరసత సేవా ఫౌండేషన్ కన్వీనర్ జోగయ్య శర్మ, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కర్నూలు మార్కెట్‌లో పారిశుద్ధ్య పనులు



పరిశుభ్రత పనులను ప్రారంభిస్తున్న మేయర్

కర్నూలు(అగ్రికల్చర్): క్రిస్మస్ సందర్భంగా సోమవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని కూరగాయల మార్కెట్, పరిసరాల్లో వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ సంస్థ పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టింది. వరల్డ్ క్లీన్ ఆఫ్ క్యాంపైన్ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మార్కెట్‌ను శుభ్రం చేసి వ్యాపారులకు అవగాహన కల్పించారు. సంస్థ సేవలను మేయర్ ప్రశంసించారు. సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. కార్యక్రమంలో సంస్థ కర్నూలు ప్రతినిధి సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సెక్రటరీ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో వీఆర్ఏగా పనిచేస్తున్న ఓ.టి.మూకన్న (65) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందారు. గతేడాది నుంచి చికిత్స పొందుతున్నారని, కోలుకోలేక మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి.. రూ.15 వేలను డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, ఆర్ఐ జయరామిరెడ్డి చేతులమీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. వీఆర్వో రమేష్, వీఆర్ఏల సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, మండలాధ్యక్షుడు వెంకటేశులు, కార్యదర్శులు సిద్ధప్ప, నాగరాజు సంతాపం వ్యక్తం చేశారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న ఎద్దులు

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. సోమవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా స్థానిక ఏబీఎం చర్చి సంఘస్తులు చేట్ల వందనాలు ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో మొత్తం 15 జతల ఎద్లు పాల్గొన్నాయి. కోడుమూరు మండలం, వెంకటగిరి గ్రామానికి చెందిన బీఎల్‌కే ఎద్లు నిర్దీత సమయానికి 4996 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి రూ.35 వేలు కైవసం చేసుకున్నాయి. అలాగే కర్నూలు మండలం, పంచలింగాలకు చెందిన బైరుపోగు సంకన్న వృషభాలు 4800 అడుగులు లాగి రెండో బహుమతి రూ.30వేలు దక్కించుకున్నాయి. కర్నూలు మండలం, పి.రుద్రవరం గ్రామానికి చెందిన రాముడు, ఎల్లగౌడు వృషభాలు 4671 అడుగులు లాగి మూడో బహుమతి రూ.20 వేలు సాధించగా, నాగర్‌కర్నూలు జిల్లా, కొల్లాపురానికి చెందిన మాస్టర్ సాత్విక్ ఎద్దులు 4449 అడుగులు లాగి నాల్గో బహుమతి రూ.10 వేలను గెలుచుకున్నాయి. బండిఆత్మకూరు మండలం, సోమయాజులపల్లె గ్రామానికి చెందిన నరసయ్యయాదవ్ వృషభాలు 4319 అడుగులు లాగి ఐదో బహుమతి రూ.6016 సాధించగా, కృష్ణగిరి మండలం, ఆలంకొండ గ్రామానికి చెందిన మునిరంగడు, కర్నూలు మండలం, గొందిమల్లకు చెందిన షేక్షావలి(విడిజత) ఎద్దులు 4200 అడుగులు లాగి ఆరో బహుమతి రూ.4016 సాధించినట్లు నిర్వాహకులు వందనాలు తెలిపారు. పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, రామనాయుడు, శంకర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహానందికి చేరిన అయోధ్య రాముడి అక్షింతలు

మహానంది: జనవరి 22వ తేదీన అయోధ్యలో జరిగే రామ జన్మభూమి ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముడి అక్షింతలను సోమవారం మహానందికి తీసుకొచ్చారు. ఈ మేరకు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మ మహేశ్వర్ రెడ్డి, ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర్ అవధాని, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జనవరి ఒకటో తేదీ నుంచి ఇంటింటికి అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్, విశ్వహిందూ పరిషత్, భజరంగ దళ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్లెల్సీకి నీరు బంద్



హొళగుంద సెక్షన్‌లోని దిగువ కాలువ (ఎల్లెల్సీ)లో తగ్గిన నీరు

హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు విడుదల అవుతున్న నీటిని సోమవారం టీబీ బోర్డు అధికారులు నిలిపివేశారు. గంటకు వంద క్యూసెక్కులు చొప్పున తగ్గిస్తూ సాయంత్రానికి పూర్తిగ నిలిపివేశారు. జిల్లాకు సంబంధించి ఎల్లెల్సీ పరిధిలో ఆంధ్ర కాలువ ప్రారంభం (హన్వాళ్ సెక్షన్) 250 కి.మీ వద్ద ఇంకా ప్రవాహం కొనసాగుతోంది. గత నాలుగేళ్లుగా సమృద్ధిగా వర్షాలతో తుంగభద్ర జలాశయంలో పూర్తిస్థాయిలో నీరు చేరుతుండడంతో దిగువ కాలువ (ఎల్లెల్సీ) కింద రైతులు రెండు కార్ల పంటలు పండించారు. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఎల్లెల్సీ కింద ఒక కారు పంటకు (ఖరీఫ్) మాత్రమే నీరు సరిపోయాయి. ప్రస్తుతం టీబీ డ్యాంలో 10.5 టీఎంసీల నీరు మాత్రమే ఉండడంతో వాటిని వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి అవసరాలకు మాత్రమే వాడుకోనున్నారు. ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో జీరో ఉంది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో 80 టీఎంసీల నీటి నిల్వ ఉండేది.



లింగనేనిదొడ్డిలో పూజలందుకుంటున్న మునిరంగస్వామి

నేడు మునిరంగస్వామి రథోత్సవం

తుగ్గలి: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న లింగనేనిదొడ్డి మునిరంగస్వామి తిరునాల ఉత్సవాలను ఆలయ మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండురోజులుగా మునిరంగస్వామి, తిమ్మగురుడులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకున్నారు. కొండపై భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. నంద్యాల పక్కీరప్పతాత ఆధ్వర్యంలో మంగళవారం వేర్వేరుగా రథోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ తెలిపారు.